సాక్షి
రంగారెడ్డి

శనివారం । 7 । సెప్టెంబర్ । 2024



సాగర్ రోడ్డుకు మహర్దశ

నాగార్జునసాగర్– హైదరాబాద్ రో మహర్దశ పట్టనుంది. నాలుగు లేన విస్తరణ నిర్ణయంపై హర్షం వ్యక్తం అవుతోంది. 10లో▸



ఇబ్రహీంపట్నం: రోడ్డు పక్కన పత్రుల విక్రయం

న్యూస్‌రీల్

బాలాపూర్ గణేశ్ ఉత్సవాలకు రండి

సీఎం రేవంత్ రెడ్డికి ఉత్సవ సమితి ఆహ్వానం



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానించిన గణేశ్ ఉత్సవ సమితి నిర్వాహకులు

బడంగ్‌పేట్: లడ్డూకు ప్రసిద్ధి చెందిన బాలాపూర్ గణనాథుని నవరాత్రుల ఉత్సవాలకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉత్సవ సమితి నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని సీఎం నివాసంలో ఆయనను కలిసి సన్మానించారు. బాలాపూర్ గణేశుడిని దర్శించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలను కాపాడండి

హైడ్రాకు ఫిర్యాదు



హైడ్రా కార్యాలయం వద్ద పరిరక్షణ సమితి సభ్యులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలోని చెరువులు, కుంటలు, కాలువలను కాపాడాలని కోరుతూ మాసబ్ చెరువు పరిరక్షణ సమితి సభ్యులు శుక్రవారం నగరంలోని హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పరిరక్షణ సమితి సభ్యులు మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అధికారులు తోడవడంతో మున్సిపాలిటీ పరిధిలోని మాసబ్ చెరువు, కొత్త చెరువు, ఎర్రకుంట, గంగరాయి చెరువు, బ్రాహ్మణపల్లి చెరువు ముంజ కుంట, రేగుల కుంట వాగులు అన్యాక్రాంతం అయ్యాయని పేర్కొన్నారు. హైడ్రా అధికారులు స్పందించి విచారణ చేపట్టి ఆక్రమణలను తొలగించడంతో పాటు, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చెరువు పరిరక్షణ సమితి సభ్యులు జీఆర్ కరుణాకర్, బోసుపల్లి ప్రతాప్, గుత్తా మహేందర్ రెడ్డి, డి.కిషన్, కళ్యాణ్ నాయక్, కొంతం యాదిరెడ్డి, రావుల వీరేశం, అజయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ గోదాంలను సద్వినియోగం చేసుకోవాలి

ఐసీఎం డిప్యూటీ డైరెక్టర్ నీలుపాండే



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీఎం డిప్యూటీ డైరెక్టర్ నీలుపాండే

షాద్‌నగర్‌రూరల్: రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించే వరకు పంటను నిల్వ చేసుకోవాలని ఐసీఎం (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో–ఆపరేటివ్ మేనేజ్‌మెంట్) డిప్యూటీ డైరెక్టర్ నీలుపాండే అన్నారు. పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన నీలుపాండే మాట్లాడుతూ.. రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకెళ్లిన సమయంలో రేటు తక్కువగా ఉన్నట్లయితే విక్రయించకుండా నిల్వ చేసుకోవాలని సూచించారు. రైతులు తమ ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం గోదాంలను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. పంట నిల్వ చేసుకునేందుకు రైతులు తక్కువ మొత్తంలో రుసుము చెల్లించాల్సి ఉంటుందని, నిల్వ చేసిన దానికి సంబంధించిన విలువ (వాల్యుయేషన్)ను రాసి ఒక రిసీట్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ గోదాంలో ఇచ్చిన వాల్యుయేషన్‌పై ఏ బ్యాంకులోనైనా 70శాతం రుణం పొందొచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీఎం లెక్చరర్ అరుణ్‌కుమార్, ఎస్ఈఆర్ఎల్, డీసీసీబీ బ్యాంకు మేనేజర్ రవికుమార్, సింగిల్‌విండో అధ్యక్షుడు బక్కన్నయాదవ్, ఉపాధ్యక్షుడు చల్లా పాండురంగారెడ్డి, సీఈఓలు రఘునందన్, వెంకటయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పూజలందుకోవయ్య బొజ్జ గణపయ్య



ఆమనగల్లు: గణేశ్ విగ్రహాన్ని ఇంటికి తీసుకెళ్తున్న చిన్నారి

వినాయక చవితి పర్వదిన్నాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొనేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. నిర్వాహకులు ఇప్పటికే గణనాథుడి ప్రతిమలను మండపాలకు తరలించారు. మండపాలను పూలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. శనివారం పండుగ నేపథ్యంలో శుక్రవారం మార్కెట్లలో సందడి కనిపించింది. విగ్రహాలు, పూజకు అవసరమైన పూలు, పండ్లు, పత్రుల కొనుగోళ్లతో కోలాహలం నెలకొంది.



చేవెళ్ల: అంబేడ్కర్‌నగర్ కాలనీలో ముస్తాబైన మండపం



ఆమనగల్లు: వినాయకుడి ప్రతిమను మండపానికి తరలిస్తున్న కమిటీ సభ్యులు



ఇబ్రహీంపట్నం: ఉత్సవాలకు తరలుతున్న గణనాథుడు

వీధి దీపం.. వెలుగు శూన్యం

మున్సిపాలిటీల్లో వెలగని స్ట్రీట్ లైట్లు

- శివారు కాలనీల్లో అలముకున్న చీకట్లు
- నిర్వహణను గాలికొదిలేసిన ఏజెన్సీ
- బకాయిల పేరుతో పట్టించుకోని సంస్థ
- చేతులెత్తేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- రాత్రివేళ బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న జనాలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: శంషాబాద్ మున్సిపల్ పరిధిలో 400కుపైగా వీధి లైట్లు, శంకర్‌పల్లి మున్సిపాలిటీలో 350కిపైగా, తుక్కుగూడలో 100కుపైగా వీధి దీపాలు వెలగడం లేదు. ఈ మూడు మున్సిపాలిటీల్లోనే కాదు జిల్లాలోని మీర్‌పేట్, బడంగ్‌పేట్, నార్సింగి కార్పొరేషన్లు, ఇతర మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు వీధుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రివేళ రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతల్లో పడి ప్రమాదాల బారినపడుతున్నారు. పాడైన పాతలైట్లను మార్చాలని, కొత్తగా వెలసిన కాలనీల్లో లైట్లు వేయాలని ప్రజల నుంచి అధికారులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు విజ్ఞప్తులు పెరుగుతున్నా వారు కూడా ఏమీ చేయలేక నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క లైటు కూడా మార్చింది లేదు..

మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోని కాలనీల్లో ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు, నిర్వహణ కోసం గత ప్రభుత్వం 2017లో ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) అనే కేంద్ర ప్రభుత్వ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. తెలంగాణ వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల వీధిలైట్ల నిర్వహణ బాధ్యతను ఈ సంస్థకు అప్పగించింది. ఈ మేరకు జిల్లాలోని 13 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లను కూడా ఈ సంస్థకే అప్పగించింది. సదరు సంస్థ వీధుల్లో తక్కువ విద్యుత్ ఖర్చుతో ఎక్కువ వెలుగులు పంచే ఎల్ఈడీ లైట్లు అమర్చింది. సకాలంలో బిల్లులు చెల్లించడం లేదనే సాకుతో మూడేళ్ల క్రితమే నిర్వహణ బాధ్యతను గాలికొదిలేసింది. ఈదురు గాలితో కూడిన వర్షానికి లైన్లు మెలిక పడుతుండటం, చెట్ల కొమ్మలు విరిగి పడుతుండటంతో షార్ట్‌సర్క్యూట్ తలెత్తి.. లైట్లు కాలిపోతున్నాయి. అంతేకాదు వర్షానికి వైరింగ్ జాయింట్ల మధ్య కార్బన్ చేరుతుండటం, ట్రిమర్ స్విచ్‌లు ఫెయిలై లైట్లు వెలగడం లేదు. ఎప్పటికప్పుడు రిపేర్లు చేసి పాడైన వాటి స్థానంలో కొత్తవి అమర్చాల్సి ఉన్నా మూడేళ్లుగా నిర్వహణ సంస్థ ఒక్క లైటు కూడా మార్చలేదు. శివారులో పుట్టుకొస్తున్న కాలనీల్లో కొత్త లైట్లు అమర్చ లేదు.

మున్సిపాలిటీలపై బకాయిల భారం..

- మీర్‌పేట్ కార్పొరేషన్‌లో మొత్తం 8,200 వీధిలైట్లు ఉండగా 20 శాతం వెలగడం లేదు. ఇప్పటి వరకు ఏజెన్సీకి రూ.3.30 కోట్లు చెల్లించింది. మరో 2.15 కోట్లు బకాయిపడింది.
- బడంగ్‌పేట్‌లో 16,845 లైట్లు ఉండగా 25 శాతం వెలగడం లేదు. వీటి కోసం రూ.5.29 కోట్ల బడ్జెట్ కేటాయించి, ఇప్పటికే ఏజెన్సీకి రూ.4.94 కోట్లు చెల్లించింది. మరో రూ.1.59 కోట్ల బకాయి పడింది.
- శంకర్‌పల్లిలో 2,370 లైట్లు ఉండగా 400పైగా వెలగడం లేదు. రూ.6 లక్షలు బకాయి పడింది.
- శంషాబాద్‌లో 12,000పైగా లైట్లు ఉన్నాయి. వీటిలో 400పైగా వెలగడం లేదు. ఏజెన్సీకి రూ.60 లక్షలు బకాయి పడింది.
- కొత్తూరులో 1,510 లైట్లు ఉండగా 15కుపైగా వెలగడం లేదు.
- ఆమనగల్లులో 1,657 లైట్లు ఉండగా 121 పని చేయడం లేదు. సంస్థకు రూ.12.57 లక్షలు బాకీ పడింది.
- ఇబ్రహీంపట్నంలో 3,544 లైట్లు ఉండగా, మరో 1,800 అవసరం. ఏజెన్సీకి రూ.82.23 లక్షలు చెల్లించాల్సి ఉంది.
- మణికొండలో 15,231 వీధిలైట్లు ఉండగా 30 శాతం పని చేయడం లేదు. సంస్థతో తెగతెంపులు చేసుకుని నిర్వహణ బాధ్యతను స్వయంగా చూసుకునేందుకు మున్సిపాలిటీ సిద్ధమైంది.
- తుక్కుగూడలో 4000కుపైగా లైట్లు ఉండగా వందకుపైగా పని చేయడం లేదు.
- తుర్కయంజాల్‌లో 12 వేల వీధి దీపాలు ఉండగా చాలా వరకు రిపేరులోనే ఉన్నాయి.
- పెద్ద అంబర్‌పేట్‌లో 8 వేలకుపైగా వీధి దిపాలు ఉండగా 25 శాతం వెలగడం లేదు.
- ఆదిబట్లలో 4,189 లైట్లు ఉండగా 20 శాతం వెలగడం లేదు. ఏజెన్సీకి రూ.26.20 లక్షలు బకాయి పడింది.
- షాద్‌నగర్‌లో 7,212 లైట్లు ఉండగా 350 పని చేయడం లేదు. రూ.42 లక్షలు బకాయి పడింది.
- నార్సింగి కార్పొరేషన్‌లో 6,640 వీధిలైట్లు ఉండగా రూ.40 లక్షలు బకాయి పడినట్లు తెలిసింది.



శంషాబాద్‌లోని ఓ వీధిలో వెలగని వీధి దీపం

ప్రమాదాల దారులు

పాతవి వెలగక పోవడం, కొత్తవి రాకపోవడంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు నెలల తరబడి చీకట్లోనే మగ్గిపోవాల్సి వస్తోంది. విధిలేని పరిస్థితుల్లో కొన్ని కాలనీ సంక్షేమ సంఘాలు వీటిని సమకూర్చుకుంటున్నాయి. వీధుల్లో లైట్లు వెలగక పోవడంతో ఎక్కడ గుంత ఉందో తెలియని పరిస్థితి. పాములు, తేళ్లు, ఇతర విషపురుగులు రోడ్లపైకి వస్తున్నాయి. చీకట్లో వాటిపై కాలుమోపితే కాటేస్తున్నాయి. మరోవైపు దొంగల బెడద శివారు ప్రాంతవాసులను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

524 మంది రైతులు.. 991 ఎకరాల్లో నష్టం

పంట నష్టంపై ప్రాథమికంగా అంచనా వేసిన అధికారులు

పంట నష్టం (ఎకరాల్లో)

పంట	రైతులు	నష్టం
వరి	63	89
పత్తి	431	864
జొన్న	21	27
మొక్కజొన్న	06	06
కంది	03	04
మొత్తం	524	991

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలో 524 మంది రైతులకు సంబంధించి 991 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు జిల్లా వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. పంట నష్టపోయిన ఆయా రైతుల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించింది. ఎకరాకు ఎంత నష్టపరిహారం చెల్లించాలనే అంశంపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. భారీ వర్షాలతో అత్యధికంగా పత్తిపంట నష్ట పోయినట్లు గుర్తించారు. ఏకధాటి వర్షాలకు ఎర్రనేలల్లోని పంట పూత పూర్తిగా రాలిపోగా, పిందెలు, కాయలు రాలిపోయాయి. నల్లరేగడి భూముల్లో వరదనీరు నిల్వ ఉండటంతో జాలువారి పంట పూర్తిగా ఎర్రబడింది. చేతికి అందివస్తుందనుకున్న పంట తీరా వరద పాలవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఒక్కో రైతు రూ.లక్షకు పైగా నష్టపోయినట్లు అంచనా. అంతేకాదు జొన్న, మొక్కజొన్న నేలవాలడంతో రైతులు భారీగా నష్టపోవాల్సి వచ్చింది. బొప్పాయి సహా ఆకుకూరలు, కాయగూరల పంటలు కూడా భారీగా దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు.



షాబాద్ మండలం తాళ్లపల్లి గ్రామంలో నీట మునిగిన పత్తి పంట

పోలీసుల హింసను అరికట్టాలి

కలెక్టర్‌కు మానవ హక్కుల వేదిక వినతి

ఇబ్రహీంపట్నం: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏడో హామీని అమలు చేసి, పోలీసుల హింసను అరికట్టాలని జిల్లా మానవ హక్కుల వేదిక కన్వీనర్లు ఎ.నర్సింహ, కె.జంగయ్య, సభ్యులు వెంకన్న, సపావట్ రాజునాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ శశాంకకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోలీసులు ప్రవర్తించిన తీరుతో ప్రజలు, రాజకీయ నాయకులు, ప్రజాస్వామికవాదులు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే పోలీసు వ్యవస్థలో సమూలంగా మార్పులు తీసుకొచ్చి ఫ్రెండ్లీ పోలీసులుగా మార్చుతామని చెప్పిందని, ఎన్నికలకు ముందు ఏడో గ్యారంటీగా హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలె గడిచినా పోలీసు వ్యవస్థలో ఎలాంటి మార్పులు చోటుచేసుకోలేదని అన్నారు. రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న సంఘటనలను వారు ఉదహరించారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు పాండు, ఆర్. శ్రీనివాస్, ఎన్.అంజయ్య, ఎస్.కిషన్, కె.కృష్ణ పాల్గొన్నారు.



కలెక్టర్ శశాంకకు వినతిపత్రం ఇస్తున్న మానవ హక్కుల వేదిక నేతలు

విధుల్లో నిర్లక్ష్యం సహించేది లేదు

జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

మహేశ్వరం: గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఫీవర్ సర్వే చేపట్టి రోగులకు సలహాలు, సూచనలు ఇస్తూ మందులు పంపిణీ చేయాలని జిల్లా వైద్యాధికారి డా.వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. మండల పరిధిలోని దుబ్బచర్ల, కందుకూరు మండలంలోని లేమూరు, రాచులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ఇతర శాఖలను సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. విధుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దుబ్బచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి, ఇతర సిబ్బంది సక్రమంగా రావడం లేదని స్థానికులు జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఇక నుంచి డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు విధులకు సక్రమంగా హాజరయ్యేలా చర్యలు చేపడతామని సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



దుబ్బచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

నిషేధిత పదార్థాలు విక్రయిస్తే చర్యలు

ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం నిషేధించిన పదార్థాలను విక్రయిస్తే చర్యలు తప్పవని ఏసీపీ రంగస్వామి హెచ్చరించారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పోలీసులు పట్టణంలోని పలు కిరాణా దుకాణాలు, దాబాల్లో ముమ్మర తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా నలుగురు సీఐలు, 10 మంది ఎస్ఐలు, 70 మంది సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో అక్రమంగా నిల్వ చేసిన మద్యం, గుట్కాను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. అక్రమంగా మద్యం, గుట్కా నిల్వ చేయొద్దని అన్నారు. నిషేధిత గుట్కా, గంజాయి, హానికరమైన పదార్థాలు విక్రయించొద్దని సూచించారు. అక్రమంగా మద్యం, గుట్కా నిల్వ చేయడం, గంజాయి అమ్మడం వంటివి చేస్తే కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో పట్టణ సీఐ విజయకుమార్, రూరల్ సీఐ సత్యనారాయణ, ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, కడ్తాల్ సీఐ శివప్రసాద్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



కిరాణ దుకాణంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

సీపీఆర్‌తో దక్కిన చిన్నారి ప్రాణాలు



చిన్నారితో డా.పరిక్షిత్‌నరేందర్

ఆమనగల్లు: ఓ చిన్నారి (15 నెలలు) అపస్మారక స్థితిలో ఉండగా ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి వైద్యులు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజక వర్గ పరిధిలోని గుంపెని పల్లికి చెందిన రాజేశ్వరి, భరత్ దంపతులు. తమ చిన్నారితో కలిసి ఆటోలో శుక్రవారం హైదరాబాద్‌కు వెళ్తుండగా ఆమనగల్లు పట్టణ సమీపంలోని సాయిబాబా దేవాలయం వద్దకు రాగానే చిన్నారి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతూ అపస్మారక స్థితికి చేరుకుంది. అదే సమయంలో ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులు డా.పరిక్షిత్ నరేందర్, నాగరాజు విధులు ముగించుకుని కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా విషయం తెలుసుకున్నారు. వెంటనే చిన్నారికి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. చిన్నారి ప్రాణాలు నిలబెట్టిన వైద్యులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు, ఆంగ్లంలో బోధించేందుకు పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

వ్యవసాయంతోనే మానవ మనుగడ

- రామచంద్ర మిషన్ గురూజీ కమ్లేశ్ డి.పటేల్
- కన్హాలో జాతీయ సదస్సు ప్రారంభం

నందిగామ: వ్యవసాయం లేనిదే మానవ మనుగడ లేదని శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ గురూజీ కమ్లేశ్ డి.పటేల్ అన్నారు. నందిగామ మండలం కన్హా శాంతి వనంలో రెండు రోజుల పాటు కొనసాగనున్న అగ్రికల్చర్ యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్ల జాతీయ సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్), డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, శ్రీకొండా లక్ష్మి తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గురూజీ మాట్లాడారు. మనిషి జీవించాలంటే వ్యవసాయం తప్పనిసరి అని తెలిపారు. ఆధునిక పద్ధతులు, తక్కువ శ్రమతో ఎక్కువ ఉత్పత్తులు సాధించేలా విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని సూచించారు. ప్రతీ మనిషి భౌతిక జీవితం ఆధ్యాత్మిక బాటలో సాగాలన్నారు. రైతులను మరింత గౌరవప్రదంగా చూసే రోజులు రావాలని ఆకాంక్షించారు. ప్రకృతిని ప్రేమిస్తూ వ్యవసాయం చేయాలని కర్షకులను కోరారు. ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ హిమాన్షు పాఠక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌సీ అగర్వాల్ మాట్లాడుతూ.. వ్యవసాయ విద్యార్థులకు మెరుగైన విద్యను బోధిస్తూ, ఇంటర్న్‌షిప్‌లు అందజేస్తూ, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఐసీఏఆర్‌కు చెందిన 62 మంది వైస్ చాన్స్‌లర్లు, 11 మంది సీనియర్ అధికారులు, పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



జ్యోతిని వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న కమ్లేశ్ పటేల్ తదితరులు


వెంకటరమణ కాలనీలో సుందరంగా తీర్చిదిద్దిన మండపం

మండపాలు ముస్తాబు


రజకనగర్ కాలనీలో సిద్ధమవుతున్న వినాయక మండపం

వినాయక నవరాత్రులకు మండపాలు ముస్తాబవుతున్నాయి. గల్లీగల్లీలో గణనాథుని ప్రతిష్ఠాపన ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. స్వామివారి పూజకు అవసరమైన పూలు, పత్రి, విగ్రహాలతో శుక్రవారం మార్కెట్లు కళకళలాడాయి. ఎక్కడ చూసినా చిన్నారులు, యువత కోలాహలం కనిపించింది.

– చేవెళ్ల

ప్లాష్.. ప్లాష్

షాద్‌నగర్‌లో బాలుడి దారుణ హత్య

షాద్‌నగర్ రూరల్: పందుల దొంగతనానికి వెళ్లిన తనను చూసిన బాలుడు.. విషయాన్ని బయటకు చెబుతాడనే కారణంతో అతి కిరాతకంగా హత్య చేశాడో వ్యక్తి. పట్టణంలోని హాజిపల్లి రోడ్డు సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. సాయమ్మ, దుర్గయ్య దంపతులకు కట్టప్ప(6) అనే కుమాడు ఉన్నాడు. ఇదే ప్రాంతంలో నివసించే ఎల్లయ్య రాత్రి 10 గంటల తర్వాత దుర్గయ్యకు చెందిన పందులను దొంగిలించేందుకు వెళ్లాడు. ఈ విషయాన్ని కట్టప్ప గమనించాడు. తాను చోరికి వచ్చిన విషయం బయటకు చెబితే జరిమానా వేయడంతో పాటు ఇబ్బందులకు గురిచేస్తారని భావించిన నిందితుడు బాలుడిని బండకేసి బాదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ సీఐ విజయ్‌కుమార్ ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వృత్తులను ప్రోత్సహిద్దాం

సాక్షి, సిటీబ్యూరో: 'అందరికి ప్రభుత్వ ఉద్యోగాలు రావడం సాధ్యం కాదు. పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కుల వృత్తులు బతకాలి. అప్పుడే అందరికీ ఉపాధి దొరుకుతుంది' అని మంత్రి పొన్నం ప్రభాకర్ అభిప్రాయ పడ్డారు. గణేష్ నవరాత్రుల్లో మట్టి విగ్రహాలు వాడడం వల్ల కుల వృత్తులు బాగుపడతాయని, వాటిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

సాగర్ రోడ్డుకు మహర్దశ

నాలుగు లేన్లకు గ్రీన్ సిగ్నల్

- జిల్లాలో 30 కి.మీ. విస్తరణ
- రోడ్డుకు ఇరువైపులా 11 మీటర్ల వెడల్పు
- సర్వేనే తరువాయి
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


విస్తరణకు నోచుకోనున్న సాగర్ రహదారి

యాచారం: నాగార్జునసాగర్– హైదరాబాద్ రహదారికి మహర్దశ పట్టనుంది. నాలుగు వరుసలుగా విస్తరణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగర్‌లోని బౌద్ధ ఆధ్యాత్మిక బుద్ధవనాన్ని సందర్శించడానికి దేశ, విదేశాల నుంచి ప్రముఖులు ఈ మార్గం నుంచే రాకపోకలు కొనసాగిస్తుంటారు. అంతే కాకుండా.. ఏపీలోని మాచర్ల, గుంటూరు, కనిగిరి, మార్కాపురం తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. నిత్యం రద్దీతో కళకళలాడే రోడ్డు సుదీర్ఘకాలం అనంతరం విస్తరణకు నోచుకోవడం గమనార్హం.

బీఆర్‌ఎస్ హయాంలో డీపీఆర్ సిద్ధం

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డును నాలుగు లేన్లుగా మార్చాలని మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విశ్వ ప్రయత్నం చేశారు. గతేడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు రోడ్డు భవనాల శాఖ అధికారులు విస్తరణకు సర్వే చేసి డీపీఆర్ (డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు)ను సైతం సిద్ధం చేశారు. కానీ సర్కారు మారడంతో విస్తరణ అంశం మరుగున పడింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం.. రోడ్డు విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో.. ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు నగరంలోని మలక్‌పేట నుంచి ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం, దేవరకొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల మీదుగా సాగనుంది.

16 మీటర్లు విస్తరణ

రోడ్డు విస్తరణతో భాగంగా రోడ్డుకు మధ్యలో డివైడర్ (రెండు మీటర్లు)తో పాటు అటు, ఇటు 16 మీటర్లుగా విస్తరించనున్నారు. విభాగిని నుంచి ఇరువైపులా 11 మీటర్ల రోడ్డు విస్తరణతో పాటు మరో ఐదు మీటర్లు సర్వీస్ రోడ్డును వెడల్పు చేయనున్నారు. విస్తరణ, సర్వీస్ రోడ్డు, పుట్‌పాత్ కలిపి ఒక వైపునే సుమారు 16 మీటర్ల రహదారి విస్తరణ చేపడుతారు. ఇందుకోసం సెయింట్ కళాశాల నుంచి మాల్ వరకు భూ సేకరణ చేయాల్సి ఉంటుంది.

ఎకరం రెండున్నర కోట్లు

ప్రస్తుతం సాగర్‌రోడ్డు ప్రాంతంలో ఎకరం భూమి ధర రూ.రెండున్నర కోట్లకు పైగానే పలుకుతోంది. యాచారం, మాల్ కేంద్రాల్లో రోడ్డు పక్కన ప్లాటు గజం ధర రూ.30 నుంచి రూ.50 వేల వరకు డిమాండ్ ఉంది. రోడ్డు అభివృద్ధి అనంతరం భూముల ధరలు మరింత ప్రియం కానున్నాయి. దుకాణ సముదాయాలు నెలకొల్పడంతో ఉపాధి అవకాశాలు ఎక్కువగానే ఉంటాయి. వ్యాపారులు లబ్ధిపొందనున్నారు.

కృష్ణా పైపు లైన్లు మారుస్తారా?

హైదరాబాద్ నగరంతో పాటు రంగారెడ్డి జిల్లాలోని ఫ్లోరైడ్ పీడిత గ్రామాల ప్రజలకు కృష్ణా జలాలను అందించేందుకు పైపులైన్లను ఏర్పాటు చేశారు. నాగార్జునసాగర్ సమీపంలోని అక్కంపల్లి (పుట్టంగండి) నుంచి రోడ్డుకు ఇరువైపులా మూడు పైపులైన్ల ద్వారా మహానగరంతో పాటు జిల్లా ప్రజలకు నీరు సరఫరా అవుతోంది. పైపులైన్లు ప్రస్తుతం సింగిల్‌రోడ్డుకు అంచులోనే ఉన్నాయి. ప్రతి అర కిలో మీటర్ దూరాన ఎయిర్ వాల్వ్‌లు అమర్చారు. అవి కూడా రోడ్డుకు దగ్గర్లోనే ఉండటంతో విస్తరణకు అడ్డుగా మారనున్నాయి. అయితే.. రహదారి విస్తరణతో కొత్తగా కొంత దూరాన పైపులైన్లు వేస్తారా? లేకపోతే యాచారం, మాల్ కేంద్రాల్లోని మాదిరిగా పైపు లైన్ల పై నుంచే విస్తరణ చేపడతారా అనేది రోడ్డు భవనాలు, వాటర్ బోర్డు అధికారులు నిర్ణయించాల్సి ఉంది. ఇదే విషయమై రోడ్లు భవనాల శాఖ డీఈఈ రవీందర్‌గౌడ్‌ను వివరణ కోరగా.. డీపీఆర్ కోసం ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదని ఆయన పేర్కొన్నారు.

జిల్లా పరిధిలో 30 కి.మీ.

నాగార్జునసాగర్–హైదరాబాద్ రోడ్డును జిల్లాలో కేవలం 30 కిలో మీటర్ల దూరం మేరకే విస్తరించాల్సి ఉంది. గత ప్రభుత్వాల హయాంలో పట్నం సమీపంలోని సెయింట్ ఇంజినీరింగ్ కళాశాల వరకు నాలుగు వరుసలుగా విస్తరణ చేపట్టారు. ప్రస్తుతం ఆ కళాశాల నుంచి మాల్ గ్రామం వరకు 30 కి.మీ. ఉంటుంది. మధ్యలో యాచారం, మాల్ కేంద్రాల్లో మూడు కిలో మీటర్ల మేర ఫోర్ వే నిర్మించారు. మరో 27 కిలోమీటర్ల పనులు మిగిలి ఉన్నాయి.

హర్షించదగిన విషయం



నాగార్జునసాగర్–హైదరాబాద్ రోడ్డు విస్తరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సంతోషమే. నగరం నుంచి పలు ప్రాంతాలకు వెళ్లే రహదారులన్నీ ఇప్పటికే నాలుగు వరుసలుగా నిర్మించారు. కేవలం సాగర్ రోడ్డు మాత్రమే సింగిల్‌గా ఉండిపోయింది. వెంటనే సర్వే పనులు విస్తృతం చేయాలి. రోడ్డు అభివృద్ధితో అందరికీ లబ్ధిచేకూరుతుంది.

– నదుకుడి కృష్ణ, వ్యాపారి, చౌదర్‌పల్లి

ఆర్థిక ఇబ్బందులే కారణం

బలవన్మరణానికి పాల్పడిన ఘటనలో బాలిక మృతదేహం వెలికితీత


లావణ్య మృతదేహం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో తల్లి, పిల్లలు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో శుక్రవారం మరో మృతదేహాన్ని వెలికి తీశారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మునగనూర్‌కు చెందిన ఓర్సు మంగ, కుమారుడు శరత్(7), కూతురు లావణ్య(17)లు గురువారం సాయంత్రం పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. మున్సిపల్, పోలీసు, ఫైర్, డీఆర్‌ఎఫ్ సిబ్బంది చెరువులో గాలించి అదే రోజు రాత్రి తల్లీకుమారుడి మృతదేహాలు వెలికితీశారు. వర్షంతో పాటుగా చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. శుక్రవారం తిరిగి గాలింపు చర్యలు చేపట్టగా లావణ్య మృతదేహం లభ్యమైంది.

దంపతుల మనస్పర్థలు.. ఆర్థిక ఇబ్బందులే కారణం

సీఐ సత్యనారాయణ తెలిపిన ప్రకారం.. వీరి ఇరువురిదీ రెండో వివాహం.. రాళ్లు కొట్టి జీవనం సాగిస్తున్న కుమార్ ఎనిమిదేళ్ల క్రితం మంగను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. మంగ మొదటి భర్తకు జన్మించిన కుమార్తె లావణ్య వీరి వద్దే ఉంటుంది. వారం రోజులగా ఏర్పడిన మనస్పర్థలతో పాటుగా.. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతోనే ఈ దుర్ఘటన చోటుచేసుకుందన్నారు. ముగ్గురు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇరు కుటుంబాల వారి నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు భద్రాద్రి ఇన్‌చార్జిగా శ్రీవర్ధన్‌రెడ్డి



షాద్‌నగర్‌రూరల్: బీజేపీ సభ్యత్వ నమోదు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్‌చార్జిగా పార్టీ ఉమ్మడి మహబూబ్‌నగర్ అధ్యక్షుడు, తెలంగాణ విమోచన కమిటీ చైర్మన్ శ్రీవర్ధన్‌రెడ్డి నియమిస్తూ కేంద్రమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పట్టణానికి చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు శ్రీవర్ధన్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జిగా పని చేశారు. భద్రాద్రి కొత్తగూడెంలో బీజేపీని బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

చేవెళ్ల: జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఇంట్లోనే ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈసంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని రామన్నగూడ గ్రామంలో గురువారం సాయంత్రం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన డి.శివ(27) కూలి పనులు, బ్యాండ్ ఆపరేటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 3న భార్యాపిల్లలు ఊరికి వెళ్లటంతో ఇంట్లోనే ఉరేసుకున్నాడు. ఎవరూ గమనించిన పోవడంతో భార్య పరమేశ్వరి గురువారం సాయంత్రం వచ్చేసరికే దుర్వాసనాల వెలువడింది. తలుపు తీయగా విగతజీవిగా ఉన్న తన భర్తను చూసి బోరున విలపించింది. పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహానికి శుక్రవారం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య, ఓ కూతురు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'విత్తన' గణపతి ప్రతిమల పంపిణీ

సాక్షి, సిటీబ్యూరో: పర్యావరణ హిత ఉత్పత్తులు, పండుగలను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్లాస్టిక్ పైపులు – ఫిట్టింగ్‌ల కంపెనీ ట్రఫ్లో బై హిండ్‌వేర్ ఆధ్వర్యంలో శుక్రవారం మట్టి గణపతులు పంపిణీ చేశారు. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా విత్తనాలు పొదిగిన మట్టితో తయారు చేసిన 2 వేలకు పైగా పర్యావరణ అనుకూల గణేశ విగ్రహాలను వినియోగదారులకు పంపిణీ చేశామని, అలాగే వీటిని నీటి కుండలోనే నిమజ్జనం చేయాల్సిందిగా అవగాహన కల్పించామన్నారు.

రూ.5లక్షలు రాయితీ ఇప్పిస్తామని.. రూ.18.5 లక్షలకు టోకరా

శంకర్‌పల్లి: అమాయకులకు మాయమాటలు చెప్పి బురిడీ కొట్టించే వారిని తరచూ చూస్తూనే ఉన్నాం.. అచ్చం అలాంటి ఘటనే శుక్రవారం శంకర్‌పల్లిలో చోటు చేసింది. శంకర్‌పల్లి సీఐ హబీబుల్లా ఖాన్ తెలిపిన ప్రకారం.. పట్టణానికి చెందిన పి.ప్రభావతి రెడ్డి గృహిణి. ఆమె కూతురు గత మార్చిలో ఇంటర్ పూర్తి చేసుకుది. ఉన్న ఒక్కగానొక్క కూతురును సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం వర్సిటీలో ఇంజినీరింగ్ చేయించాలనుకున్నారు. దీంతో జూలై 12న భర్త విఠల్‌రెడ్డి కూతురును తీసుకుని గీతం వర్సిటీకి వెళ్లారు. అక్కడ అనిల్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తి తాను అకౌంట్స్ సెక్షన్‌లో పనిచేసే వ్యక్తిని అని పరిచయం చేసుకున్నాడు. నాలుగేళ్లకు కలిపి కళాశాల ఫీజు రూ.16లక్షలు అవుతుందని.. తన ద్వారా ఫీజు ఏక కాలంలో చెల్లిస్తే రూ.5లక్షల వరకు రాయితీ ఇప్పిస్తానని నమ్మబలికాడు.

కేఫ్‌లో భాగస్వామ్యం పేరిట రూ.7.5లక్షలు

ఈ క్రమంలో కళాశాల ఫీజుకు డబ్బు తీసుకెళ్లమని ప్రభావతి, విఠల్‌రెడ్డి దంపతులు అనిల్‌కుమార్‌రెడ్డిని ఇంటికి ఆహ్వానించారు. అనిల్‌రెడ్డి తన స్నేహితుడు రోహిత్ కేశవరాజును వెంటబెట్టుకుని వచ్చి సినీ రచయితగా పరిచయం చేశాడు. ఈ క్రమంలో వారు అనిల్‌రెడ్డి రూ.11లక్షల కళాశాల ఫీజు ఇచ్చారు. రోహిత్ తనకు హైటెక్ సిటీలో కేఫ్ ఉందని నమ్మించాడు. తాను అనిల్ మరో కేఫ్ ప్రారంభిస్తున్నామని మీరు భాగస్వాములుగా ఉండొచ్చని నమ్మించారు. అందుకు రోహిత్‌కు రూ.7.5లక్షలు ముట్టజెప్పారు.

వర్సిటీలో ట్విస్ట్

ప్రభావతి, విఠల్‌రెడ్డి దంపతులు అనిల్, రోహిత్‌కు రూ.18.5లక్షలు ముట్టజెప్పారు. తర్వాత కళాశాల ప్రారంభ తేదీలు కనుక్కుందామని ఫోన్ చేయగా కలవలేదు. దంతో వారు నేరుగా వర్సిటీకి వెళ్లి ఆరా తీయగా అసలు వారి కూతురు పేరిట అడ్మిషన్ లేదని స్పష్టం చేశారు. దీంతో వారు మోసపోయామని గ్రహించి శుక్రవారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల ప్రాథమిక విచారణలో అనిల్‌రెడ్డి ఇప్పటికే ఇదే మాదిరిగా 30మందిని మోసం చేశాడని.. వేరే పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల అదుపులో ఉన్నాడని సీఐ తెలిపారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ


స్వపరిపాలనా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఘనంగా స్వపరిపాలనా దినోత్సవం

షాద్‌నగర్ రూరల్: ప్రతిరోజు తరగతి గదిలో శ్రద్ధగా పాఠం వినే విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పట్టణంలోని శ్రీసత్యసాయి ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ నాగలింగం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు స్వపరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. డీఈఓగా ఓంకార్, డిప్యూటీఈఓగా కార్తీక్, ఎంఈఓగా చరణ్య, ప్రిన్సిపాల్‌గా క్రితిక్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలిగా శ్రీమైదీక్షిత, ఏఓగా ఎంకెఎస్‌అమాన్‌లు తమ విధులను చక్కగా నిర్వర్తించారు. అనంతరం ప్రిన్సిపాల్ నాగలింగం మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు.

స.హ.చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా కార్యదర్శిగా అజయ్


అజయ్‌కు నియామకపత్రం అందజేస్తున్న చంటి ముదిరాజ్

సాక్షి,సిటీబ్యూరో: సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా అజయ్ కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంతటి అజయ్ కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్‌కు, జాతీయ ఉపాధ్యక్షుడు ఏటి ఆంజనేయులుకు, రాష్ట్ర అధ్యక్షుడు ఎలిగేండ్ల వెంకటేష్‌కు, జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్‌కు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సురా స్రవంతికి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశంకు కృతజ్ఞతలు తెలిపారు.